# సర్కార్ బడుల్లో సౌర వెలుగులు

- జిల్లాలో 262 పాఠశాలల ఎంపిక
- రూ.11.25 కోట్లు కేటాయించిన సర్కారు
- పాఠశాలల్లో త్వరలో సౌర పలకలను ఏర్పాటు చేయనున్న టీఎస్ రెడ్‌కో



బొంరాస్‌పేట, డిసెంబర్ 29 : సౌర శక్తిని సద్వినియోగం చేసుకుంటే విద్యుత్ ఖర్చులు బాగా తగ్గుతాయి. అందుకే ప్రభుత్వం సౌరశక్తి వినియోగాన్ని పెంచడానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బిల్లుల భారం అంతకంతకూ పెరుగుతున్నాయి. పాఠశాలలకు వచ్చే గ్రాంట్లు తక్కువగా ఉండడంతో విద్యుత్ బిల్లులు చెల్లించలేక హెచ్‌ఎంలు సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో సర్కారు బడులపై విద్యుత్ బిల్లుల భారం తగ్గించడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఇంధన వనరుగా మారిన సౌర విద్యుత్‌ను పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నాబార్డ్ ఆర్థిక సహకారంతో తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎస్ రెడ్‌కో) ఆధ్వర్యంలో సౌర విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. వికారాబాద్ జిల్లాలో రూ.11.25 కోట్లతో 262 ప్రభుత్వ పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలల జాబితాతో ఉత్తర్వులు జారీ చేయగా త్వరలోనే పనులు చేపట్టనున్నారు.

**తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం**

సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ బిల్లుల భారం గణనీయంగా తగ్గుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ పాఠాల బోధన, ఫ్యాన్లు, కంప్యూటర్లు, లైట్లు వంటి వాటిని ఏర్పాటు చేయడం వల్ల ప్రతినెలా వేల రూపాయల విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. పాఠశాలలకు వచ్చే గ్రాంట్లు చాలా తక్కువగా ఉండడంతో కరెంటు బిల్లులను చెల్లించలేక హెచ్‌ఎంలు తలలు పట్టుకుంటున్నారు. సౌర విద్యుత్ కేటాయింపుతో విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని హెచ్‌ఎంలు అభిప్రాయపడుతున్నారు. వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల్లో 1030 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 262 పాఠశాలలను సౌర విద్యుత్ కోసం ప్రభుత్వం ఎంపిక చేసింది. విద్యుత్ పలకల ఏర్పాటుకు సర్కారు రూ.11.25 కోట్లను కేటాయించింది. టీఎస్ రెడ్‌కో పాఠశాలలకు సౌర పలకలను బిగిస్తున్నది.

| మండలం | ఎంపికైన పాఠశాలలు | సౌర విద్యుత్ సామర్థ్యం |
|---|---|---|
| బొంరాస్‌పేట | 7 | 32 |
| బషీరాబాద్ | 14 | 44 |
| బట్వారం | 8 | 39 |
| చౌడాపూర్ | 9 | 30 |
| ధారూర్ | 11 | 54 |
| దోమ | 13 | 63 |
| దౌల్తాబాద్ | 13 | 61 |
| దుద్యాల | 6 | 29 |
| కొడంగల్ | 17 | 68 |
| కోట్‌పల్లి | 6 | 29 |
| కులకచర్ల | 13 | 57 |
| మర్పల్లి | 20 | 74 |
| మోమిన్‌పేట | 11 | 57 |
| నవాబ్‌పేట | 9 | 99 |
| పరిగి | 16 | 64 |
| పెద్దేముల్ | 15 | 68 |
| పూడూరు | 14 | 63 |
| తాండూరు | 22 | 85 |
| వికారాబాద్ | 20 | 89 |
| యాలాల | 18 | 20 |

**కిలోవాట్‌కు రూ.లక్ష**

పాఠశాలలోని విద్యార్థులు, తరగతి గదుల సంఖ్య, పాఠశాల అవసరాలను గుర్తించిన అధికారులు అందుకు అనుగుణంగా సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పాఠశాలకు కనిష్ఠంగా రెండు కిలోవాట్లు, గరిష్ఠంగా 10కిలోవాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో కిలోవాట్‌కు రూ.లక్ష చొప్పున గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధులను ఖర్చు చేయనున్నారు. ప్రాథమిక పాఠశాలలకు రెండు కిలోవాట్లు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఐదు కిలోవాట్లు, వసతి సౌకర్యం, విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండే కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలకు పది కిలోవాట్ల సామర్థ్యంతో జిల్లాలో 1125 కిలోవాట్ల సౌర విద్యుత్ తయారీకి సరిపడా యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు.

**త్వరలో ఏర్పాటుకు చర్యలు**



ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో సౌర విద్యుత్ యూనిట్లు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. మొదట మన ఊరు-మన బడి పాఠశాలల్లో ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యమిస్తున్నాం. వీటి ఏర్పాటుతో పాఠశాలలకు నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉండడం వల్ల డిజిటల్ పాఠాల బోధనకు, ఆన్‌లైన్ నమోదు వంటి పనులకు అంతరాయం ఉండదు.

**- రేణుకాదేవి, డీఈవో, వికారాబాద్**

## పథకాలకు దరఖాస్తు చేసుకోండి

**ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ**



వికారాబాద్, డిసెంబర్ 29 : ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం వికారాబాద్ మండలం పెళ్లిమడుగు, నారాయణపూర్ గ్రామాలు, వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట, కొత్రేపల్లి, వెంకటపూర్ తండాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 6వ తేదీ వరకు అర్హులందరూ గ్రామసభల్లో పాల్గొని దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దరఖాస్తులను స్వీకరిస్తూ, దరఖాస్తులను నింపేందుకు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో విజయకుమారి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుభాషిణి, ఎంపీపీ చంద్రకళ, ఎంపీడీవో సత్తయ్య, వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఎంపీవో నాగరాజు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు సంఘం శరణం గచ్ఛామి నాటిక ప్రదర్శన

వికారాబాద్, డిసెంబర్ 29 : బాబా సాహెబ్ అంబేద్కర్ జీవిత చరిత్ర, సాధించిన ఘనతలపై ఈనెల 30న సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు వికారాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎన్.మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు అంబేద్కర్ భవనంలో హైదరాబాద్ వారిచే అభ్యుదయ కళా బృందం సంఘం శరణం గచ్ఛామి అనే నాటక ప్రదర్శన చేయబడుతుందని తెలిపారు. ఇందుకు వికారాబాద్ జిల్లా, పట్టణ ప్రజలు, పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు, వివిధ సంఘాల నాయకులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ

**రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ యాదగిరి**

ధారూరు, డిసెంబర్ 29 : నేటి నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ధారూరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎస్‌ఆర్‌ఈజీఎస్) 14వ విడుత సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ యాదగిరి తెలిపారు. శుక్రవారం ధారూరు మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో ఎంపీడీవో చెన్నారెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 32 గ్రామ పంచాయతీలను మూడు విడుతలుగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడుతగా 8గ్రామ పంచాయతీలు మున్నూర్ సోమారం, అల్లాపూర్, మోమిన్‌కలాన్, నాగారం, చింతకుంట, అల్లీపూర్, కేరెళ్లి, అంతారం గ్రామాల్లో మొదటి విడుతగా మూడు రోజుల పాటు తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. వచ్చే నెల 10 తర్వాత గ్రామాల తనిఖీలు పూర్తి చేసి మండల కేంద్రంలో మండల స్థాయి తనిఖీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో సురేశ్‌కుమార్, ఈసీ రమేశ్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలి

**విద్యుత్ శాఖ ఆర్‌ఆర్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆనంద్**



కాలనీ వాసులను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న చీఫ్ జనరల్ మేనేజర్ ఆనంద్

తుర్కయాంజాల్, డిసెంబర్ 29 : విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ అధికారులే ప్రజల వద్దకు వెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని విద్యుత్ శాఖ ఆర్‌ఆర్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఆయన తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ లక్ష్మీనగర్‌కాలనీ, ఇందిరమ్మకాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దెబ్బతిన్న, వంగిపోయిన, తుప్పుపట్టిన, ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. అదే విధంగా బిల్లుల్లో పేరు మార్పు సంబంధించి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట విద్యుత్‌శాఖ ఎస్ఈ కరుణాకర్‌బాబు, డీఈ యాదగిరి, ఏడీఈ వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యా మండలి నూతన కార్యదర్శికి ఘన సన్మానం

వికారాబాద్, డిసెంబర్ 29 : తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి నూతన కార్యదర్శిగా శృతి ఓజాను శుక్రవారం రాష్ట్ర టీపీజేఎంఏ అధ్యక్షుడు గౌరీసతీష్, కార్యదర్శి తిరుపతిరెడ్డి, అధికార ప్రతినిధి కె. శ్రీనివాస్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. వారితో పాటు టీపీజేఎంఏ రాష్ట్ర బాధ్యులు ఉన్నారు.



శృతిఓజాను సన్మానిస్తున్న టీపీజేఎంఏ రాష్ట్ర అధ్యక్షులు, సభ్యులు

## మహిళలు నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలి

ధారూరు, డిసెంబర్ 29: మహిళలు శిక్షణకు హాజరై నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలని సీడ్స్ సంస్థ సీఈవో ఎస్.నాగబ్రహ్మచారి అన్నారు. శుక్రవారం ధారూరు మండల కేంద్రంలో నాబార్డు సహకారంతో సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులకు జీవనోపాధుల మెరుగుకై చిరుధాన్యాల సాగు పద్ధతులు, ఆహార శుద్ధీకరణ సాంకేతిక అంశాలపై పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధారూరు ఎస్‌బీఐ లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని, మహిళలు జీవన పదులను సద్వినియోగం చేసుకొని ఆర్థిక పురోగతి సాధించాలని మహిళా సంఘ సభ్యులకు పలు సూచనలు ఇచ్చారు. శిక్షణ అనంతరం అర్హులైన వారికి బ్యాంక్‌ల నుంచి రుణ సదుపాయం కల్పించడంలో బాధ్యత తీసుకుంటామని తెలిపారు. సూక్ష్మ ఆహార శుద్ధీ పరిశ్రమల నెలకొల్పేందుకు భారత రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అనేక స్కీమ్‌ల ద్వారా సదుపాల ఉన్నాయని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సాంకేతిక నైపుణ్యాలు, ప్రభుత్వ సదుపాయాలు పొందుతారని తెలియజేశారు. కార్యక్రమంలో సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్, వికారాబాద్ రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ వాల్యా, సంఘ సభ్యులు ఉన్నారు.



## జూడో లీగ్ చాంపియన్ షిప్‌లో గురుకుల విద్యార్థిని ప్రతిభ

మొయినాబాద్, డిసెంబర్ 29 : సౌత్ జోన్ ఖేలో ఆల్ ఇండియా ఉమెన్స్ జూడో లీగ్ చాంపియన్ షిప్‌ను చేవెళ్ల గురుకుల విద్యార్థిని కైవసం చేసుకున్నది. ఇటీవలన ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో డిసెంబర్ 25 నుంచి 28 వరకు జరిగిన 3వ ఖేలో ఆల్ ఇండియా ఉమెన్స్ జూడో లీగ్ 2023-24 పోటీల్లో మొయినాబాద్ మండల పరిధిలోని తోలుట్టా గ్రామంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దీపిక పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఆమెకు రూ.5000 నగదు బహుమతి సాధించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారి శారదావెంకటేష్, కళాశాల ప్రిన్సిపాల్ డి.రమాదేవి దీపికను అభినందించారు.

